క్లుప్తంగా

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు వినతి

డోన్ టౌన్: గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు, సహాయ కార్యదర్శి రామ్మోహన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో డోన్‌లోని దొరపల్లె, ఉడుములపాడు వద్ద సుమారు వంద ఎకరాల్లో 4 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ నిర్మాణాలను పూర్తి చేసేందుకు త్వరితగతిన బిల్లులు అందించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని నాల్గో సచివాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటింటా మొక్కలు నాటితే ఊరంతా వనంగా మారుతుందని తెలిపారు. చెత్త చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని సూచించారు.

లేఔట్ యజమానులకు నోటీసులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా లేఔట్లు వేసిన యజమానులకు రెండోసారి నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేఔట్లు వేశారని, నంబర్ రాళ్లు, ముళ్లకంచెలు, రహదారులను తొలగించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీసులు అందుకున్నవారిలో బోయ శ్రీనివాసులు, నాగిరెడ్డి, వెంకట మోహన్‌బాబు, మధు, జూలకంటి రెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, దస్తగిరి, శివ, జక్కా జ్యోతి ఉన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

బనగానపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు పెంచితే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని, వర్షాలు సకాలంలో కురుస్తాయన్నారు. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో మద్దయ్య, మద్దిలేటి, శ్రీను, సాలయ్య, వాకర్ మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏకశిలా రూపంలోని శివపార్వతులకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మాళేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గిన మిరప సాగు

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్-10 మిరప పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఈ సంవత్సరం బనగానపల్లె మండలంలో కేవలం 100 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో 1500-1800 హెక్టార్లలో సాగు జరిగి, క్వింటాళ్లకు రూ.21-22 వేల ధర లభించేదని రైతులు గుర్తు చేశారు. ప్రస్తుతం ధరలు రూ.12-15 వేలకే పడిపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుల పాలై మిరప సాగును తగ్గించక తప్పలేదని చెప్పారు.



కోవెలకుంట్ల: వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



పాతపేట అమ్మవారిశాలలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు



కోవెలకుంట్ల: మారెమ్మ ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా..



గొర్విమానుపల్లెలో బాలాత్రిపురసుందరిగా..



బనగానపల్లె: శైలపుత్రిదేవిగా కన్యకాపరమేశ్వరి

జగజ్జననీ నమోస్తుతే

- ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
- భక్తులతో ఆలయాలు కిటకిట



సంజామల: స్వర్ణదేవిగా వాసవీమాత



ప్యాపిలి: స్వర్ణకవచాలంకరణలో అమ్మవారు



డోన్ అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిదేవిగా..



రహిమానుపురంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



డోన్ పాతబస్టాండ్‌లో బాల త్రిపురసుందరిగా..



అవుకులో రాజరాజేశ్వరిదేవి

బనగానపల్లె రూరల్: బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించారు. అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కొండపేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు శైలపుత్రి దేవిగా దర్శనమిచ్చారు. అయ్యప్పస్వామి ఆలయంలో గాయత్రీ దేవి బాలత్రిపుర సుందరి అలంకారంలో దర్శనం ఇచ్చారు.

- డోన్ టౌన్: పాతపేట అమ్మవారిశాలలో వాసవీ కన్యాకాపరమేశ్వరిని మొదటి రోజు రాజరాజేశ్వరి అలంకరణలో పూజలందుకున్నారు. పాత బస్టాండ్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద కనకదుర్గమ్మ మాలదీక్షాపరులు ఏర్పాటు చేసిన మండపంలో, అలాగే పాత బస్టాండ్‌లోని దుర్గమ్మగుడిలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
- కోవెలకుంట్ల: మండలంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి రాజరాజేశ్వరిగా భక్తులకు అభయమిచ్చారు. పట్టణానికి చెందిన గోనెగండ్ల కృష్ణమూర్తి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే మారెమ్మ, ప్రసన్నభారతి దేవి ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకారంలో భక్తులను కటాక్షించారు.
- కొలిమిగుండ్ల: మండలంలోని గొర్విమానుపల్లె పెద్దమ్మ ఆలయం, బందార్లపల్లె సమీపంలోని నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమం, తిమ్మనాయినపేట, పెట్నికోట గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అవుకు పట్టణంలో వాసవీమాతను రాజరాజేశ్వరి అలంకరణలో పూలతో విశేషంగా అలంకరించారు.
- బేతంచెర్ల: పట్టణంతో పాటు ఆర్‌ఎస్ రంగాపురం, రహిమానుపురం, సిమెంట్ నగర్ గ్రామాల్లో భక్తులు దుర్గామాత ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. రహిమానుపురంలో సర్పంచ్ ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే స్థానిక వాసవీమాత ఆలయంలో అమ్మవారిని బాలత్రిపురసుందరి అలంకారంలో తీర్చిదిద్దారు. చిన్నారులను బాలత్రిపురసుందరి రూపంగా భావించి పూజలు చేశారు.
- ప్యాపిలి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ ఆవాసన, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. వాసవీమాత స్వర్ణకవచాలంకృత రూపంలో దర్శనమిచ్చారు. వంకదారి మాణిక్యం, వంకదారి రామకృష్ణయ్యలు శాశ్వత పూజాదాతలుగా వ్యవహరించారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.



బాల త్రిపుర సుందరిగా దుర్గమ్మ



నేలబెలుంలో పార్వతీదేవి



బేతంచెర్ల అమ్మవారిశాలలో..

విజృంభిస్తున్న విష జ్వరాలు



ఓపీ తీసుకునేందుకు క్యూకట్టిన రోగులు



వైద్యంకోసం వేచి ఉన్న రోగులు

-రోగులతో ఆస్పత్రులు కిటకిట

కోవెలకుంట్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని విష జ్వరాలు (వైరల్ ఫీవర్) విజృంభిస్తున్నాయి. కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని అయా గ్రామాల్లో జ్వరాలు ప్రబలడంతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం, తదితర లక్షణాలతో సోమవారం పదుల సంఖ్యలో రోగులు కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్స నిమిత్తం తరలిరావడంతో కిటకిటలాడింది. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు. సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మద్దిలేటిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మద్దిలేటిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సోమవారం మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో గోపూజ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, హోమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు సహస్ర దీపాలంకరణ సేవలో ఆదిలక్ష్మీగా కనువిందు చేశారు. రాత్రి ఆలయ మాడ వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు.

నేడు జిల్లా మహాసభలు

కర్నూలు(సెంట్రల్): మెప్మా ఆర్పీల సంఘం జిల్లా మహాసభలు మంగళవారం కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో జరుగనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి సోమవారం తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, శ్రామిక మహిళా కన్వీనర్ నిర్మల ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

వేతనాలు పెంచాలని ఆశా కార్యకర్తల నిరసన





డోన్‌లో నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు, బేతంచెర్లలో వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

డోన్ టౌన్: ఆశా వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వడంతో పాటు శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, ఆశ వర్కర్ల యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు ఉమ, హుస్సేన్‌బీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము 8 నుంచి 10 గంటలపాటు కష్టపడి పనిచేస్తున్నా కనీస వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలు, వ్యాక్సిన్ కేంద్రాలకు రోగులను తీసుకురావడం వంటి అదనపు పనులు మోపుతున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే సమరశీల పోరాటాలకు సిద్ధమని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు సుశీలమ్మ, కవిత, ఫాతీమా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

బేతంచెర్ల: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర సమితి సభ్యురాలు కోట్ల మహాలక్ష్మి, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల వేతనాల పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు ఇవ్వాలని కోరారు. అలాగే భూ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, మండల కార్యదర్శి రామ్మోహన్ తదితరులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఆటోడ్రైవర్లు డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు.



ప్యాపిలి: వినతిపత్రం అందజేస్తూ..

ప్యాపిలి: ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని ఆశా వర్కర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, సుధాలక్ష్మి, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ఆశా వర్కర్లకు కూడా వర్తింపచేయాలన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి రాజ్యసభలో అమలు చేస్తామన్న ప్రయోజనాలకు సంబంధించి జీఓ విడుదల చేయాలని కోరారు. సీపీఐ నేత వెంకటేశ్, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, సుధా, సుగుణమ్మ పాల్గొన్నారు.

టీచర్ల నియామకాల్లో అవకతవకలపై ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డోన్ టౌన్: ఇటీవల నిర్వహించిన డీఎస్సీ-2025 టీచర్ల నియామకాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట విజయభాస్కర్, భారతీయ విద్యా పరిషత్ నాయకుడు మహేష్ ఆరోపించారు. సోమవారం కర్నూలులో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు అందజేశారు. జనరల్, పీహెచ్‌సీ కోటాల్లో స్థానికులకు అన్యాయం చేసి నాన్-లోకల్ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. దీనిపై రీ వెరిఫికేషన్ జరిపి నిజమైన అభ్యర్థులకు న్యాయం చేయాలని, అవినీతికి పాల్పడిన సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

13 గంటల పని విధానం దారుణం



డోన్: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు



బేతంచెర్ల: నిరసన తెలుపుతున్న నాయకులు

డోన్ టౌన్: ఇటీవల శాసనసభలో ఆమోదించిన 13 గంటల పని విధానం బిల్లును వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, శివరామ్, సీపీఎం నాయకులు కొండన్న డిమాండ్ చేశారు. సోమవారం బేతంచెర్ల సర్కిల్‌లో నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 139 సంవత్సరాల క్రితం కార్మికుల త్యాగాలతో సాధించిన 8 గంటల పని విధానాన్ని తొలగించడం అన్యాయం అన్నారు. మహిళా కార్మికుల భద్రతకు ఇది ముప్పని పేర్కొన్నారు. బిల్లును రద్దు చేయకపోతే మరో మే డే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. నిరసనలో సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, నాగమద్దయ్య, చిన్న రహిమాన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: శాసనసభలో ఆమోదించిన 13 గంటల పని విధానం బిల్లును తక్షణమే రద్దు చేసి, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పాత బస్టాండులో బిల్లును రద్దు చేయాలని కార్మికులతో కలిసి నిరసన తెలిపారు.



ప్యాపిలి: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ప్యాపిలి: పని గంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం, నాయకులు భాస్కర్ రెడ్డి, చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. 13 గంటల పని విధానం అంటే కార్మికులను బానిసలుగా మార్చడమే అన్నారు. మహిళలు రాత్రి వేళల్లో పని చేయాలని బిల్లులో ప్రవేశపెట్టడం బాధాకరం అన్నారు. సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, శ్రీనివాసులు, మధు, ఈరన్న, నరసింహులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం.. విజ్ఞాన్ మంథన్

- విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- దరఖాస్తుకు ఈ నెలాఖరు వరకు గడువు
- పాఠశాలస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పరీక్షలు
- విద్యార్థులకు గొప్ప అవకాశం



పేరుసోములలో విద్యార్థులకు విద్య బోధిస్తున్న ఉపాధ్యాయుడు

దరఖాస్తు గడువు	సెప్టెంబర్ 30
పాఠశాలస్థాయి పరీక్ష	అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు
జిల్లాస్థాయి పరీక్ష	నవంబర్ 19వ తేదీ
జాతీయస్థాయి పరీక్ష	2026 మే నెలలో

కోవెలకుంట్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలు, దేశంలో సీఎస్ఐఆర్, ఐఎస్ఆర్ఓ, బార్క్, డీఆర్‌డీఓ, ప్రముఖ జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను చూసే అవకాశం, ఇంటర్న్‌షిప్, ఉపకార వేతనం పొందే అవకాశం కల్పిస్తోంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 478 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆరవ తరగతి నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది.

పాఠశాల స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పరీక్షలు

కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ట్రైనింగ్, శాస్త్ర, సాంకేతిక విభాగం సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్‌లో రూ.200 రుసుం చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలి. వివిధ స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, గణితం, సామాన్యశాస్త్రం, విజ్ఞాన శాస్త్ర రంగాల్లో భారతీయ మేధావుల కృషి, సత్యేంద్రనాథ్, బోస్ జీవితచరిత్ర, లాజికల్ ఆలోచనలు, రీజనింగ్, తదితర సబ్జెక్టుల్లో బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలుంటాయి. విద్యార్థులకు మొదట పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఇంటర్‌నెట్ ద్వారా పరీక్ష రాయవచ్చు. విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే ఆన్‌లైన్ విధానంలో, సెల్‌ఫోన్, ట్యాబ్, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌ల ద్వారా పరీక్షల్లో పాల్గొనవచ్చు. ఆంగ్లం, హిందీతోపాటు 9 ప్రధాన భాషల్లో పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు. పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థాయిని బట్టి ధ్రువపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేస్తారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే విజ్ఞాన్ మంథన్ పరీక్షలకు ఆసక్తిగల విద్యార్థులను ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి కలిగించి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు వీవీఎం పరీక్ష ఉపయోగ పడుతుంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ డీఈఓ, డోన్